క్లుప్తంగా

సభ్యత్వ నమోదుపై అవగాహన



మాట్లాడుతున్న శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నాయకులు విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో నగర సెంట్రల్ అధ్యక్షుడు షణ్ముగం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సెప్టెంబర్ 1 నుంచి సభ్యత్వ నమోదు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. 88000 02024 నంబరుకు మిస్‌డ్ కాల్ ఇచ్చి సభ్యత్వం చేయించాలని పిలుపునిచ్చారు.

పుత్తూరు గంగ జాతర పోస్టర్ల విడుదల



జాతర పోస్టర్లు ఆవిష్కరణ

పుత్తూరు: గంగమ్మ జాతరను సెప్టెంబర్ 4వ తేదీన నిర్వహిస్తున్నట్టు జాతర కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం గంగమ్మ జాతర పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 27 ఉదయం గ్రామదేవత ఆరేటమ్మకు పాలాభిషేకం, సాయంత్రం అమ్మవారి ఊరేగింపు ఉంటుందని తెలిపారు. అదేరోజు రాత్రి గంగ జాతర చాటింపు ఉంటుందన్నారు. సెప్టెంబర్ 1 నుంచి గెరిగ పట్టణ పురవీధుల్లో తిరుగుతుందని వివరించారు.

టిప్పర్ ఢీకొని బాలుడికి గాయాలు



చికిత్స పొందుతున్న లోకేష్

చౌడేపల్లె: టిప్పర్ ఢీకొనడంతో బాలుడు గాయపడిన సంఘటన ఆదివారం చౌడేపల్లె–సోమల మార్గంలోని ఆమినిగుంట వద్ద చోటుచేసుకుంది. స్థానికుల కథనం.. పీలేరుకు చెందిన లోకేష్ బైక్‌లో చౌడేపల్లెకు వచ్చాడు. పనులు ముగించుకుని స్వగ్రామానికి వెళ్తుండగా ఆమినిగుంట వద్ద ముందు వెళ్తున్న టిప్పర్ ను ఓవర్ టేక్ చేస్తుండగా టిప్పర్ ఒక్కసారిగా కుడివైపు తిరగడంతో బైక్‌పై దూసుకెళ్లింది. ఈఘటనలో గాయపడిన లోకేష్‌ను స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలకు తరలిరండి

శ్రీకాళహస్తి: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆవిర్భావించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా డిసెంబర్ 14 నుంచి 17వ తేదీ వరకు కాకినాడలో నిర్వహించనున్న స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఓ ప్రైవేటు సత్రంలో యూటీఎఫ్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో నాయకుల త్యాగాల ఫలితంగా ఉపాధ్యాయులు ఉన్నత స్థానంలో ఉన్నారని తెలిపారు. భవిష్యత్తు కార్యక్రమాలను రూపొందించుకోవడానికి ప్రతి కార్యకర్త స్వర్ణోత్సవ మహాసభలో పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజశేఖర్, ముత్యాలరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పని సర్దుబాటు ప్రక్రియ అసంబద్ధంగా ఉందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు, మండల స్థాయిలో జరిగే పని సర్దుబాటుకు పొంతన లేదని విమర్శించారు. కార్యక్రమంలో సూర్యప్రకాష్, నిర్మల, శేఖర్, రాజేష్ బాబు, మోహన్‌బాబు పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి



కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి. ఇటువంటి సంఘటనలు జరగడం దురదృష్టకరం. వైద్య కళాశాలలు, ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో మహిళా డాక్టర్లకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ కల్పించాలి. ఆస్పత్రికి వచ్చే బయట వ్యక్తులపై సరైన నిఘా పెట్టాలి. మత్తు పదార్థాలు సేవించే వారిపై చర్యలు తీసుకోవాలి. అత్యవసర సమయంలో ప్రాణాలు నిలిపే వైద్యులపైనే దాడులు చేయడం ఎంతవరకు న్యాయం.

-ఆశ్రిత, జూనియర్ డాక్టర్, చిత్తూరు



రక్షణ, వసతులు కల్పించాలి



వందలాది మంది స్టాఫ్ నర్సులు, మహిళా వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది పనిచేస్తున్నారు. అయితే మహిళా సిబ్బందికి రక్షణతోపాటు సరైన మౌలిక వసతులు లేవు. ఇంటి నుంచి డ్యూటీకి వచ్చాక దుస్తులు మార్చుకునేందుకు ఆస్పత్రిలో సరైన గదులు లేవు. చాలా ఇబ్బందిగా ఉంటోంది. వాష్‌రూంలు సరిగా లేకపోవడం మరీ సమస్యగా మారింది. అసౌకర్యాలు, అభద్రత మధ్య మహిళలు పనిచేయడం ఎలా సాధ్యం. మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించాలి.

-కరిష్మా, జూనియర్ డాక్టర్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, చిత్తూరు



ఫొటోలో ఉన్న వ్యక్తి పేరు చిన్నబ్బ. ఎస్ఆర్ పురం మండలం తయ్యూరు గ్రామం. ఇతనికి మధుమేహ వ్యాధితో కొన్నేళ్ల క్రితం కాళ్లు తీసేశారు. అప్పటి నుంచి మంచానికి పరిమితమయ్యాడు. ఈ సమయంలో ఫ్యామిలీ డాక్టర్ విధానం సాయపడింది. డాక్టర్లు ఇంటికి వచ్చి ప్రతినెలా ఆరోగ్య పరీక్షలు చేసి మందులు, మాత్రలు ఇచ్చేవారు. ఇప్పుడు డాక్టర్లు రావడం లేదు. దీని కారణంగా వైద్యసేవలు అందక ఇబ్బందికరంగా మారింది. ఇంటికి డాక్టర్ విధానాన్ని కొనసాగించి మాలాంటి వాళ్లకు ఆరోగ్య భరోసా కల్పించాలని చిన్నబ్బ వెడుకుంటున్నాడు.

పల్లె నాడికి జ్వరం



ఫ్యామిలీ ఫిజిషియన్‌లో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు (ఫైల్)

- ఫ్యామిలీ ఫిజిషియన్‌కు గండం
- తలుపు తట్టని పల్లె వైద్యం
- పల్లెల్లోని పేదలకు అవస్థలు
- ఇబ్బందుల్లో పేద రోగులు

కాణిపాకం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పల్లెనాడికి జీవం పోసింది. పేదలకు పల్లెల్లోనే వైద్యసేవలను అందించింది. డాక్టర్లను ఇంటికే రప్పించింది. తలుపు తట్టేలా చేసింది. ఇంటి వద్దే వైద్య పరీక్షలు చేసి ఆరోగ్య బాగోగులను చూసుకుంది. కార్పొరేట్ తరహాలో వారి ఆరోగ్య సమస్యలను గుర్తించి, మెరుగైన వైద్యం అందించేందుకు పూనుకుంది. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం వచ్చిన దగ్గరనుంచి పల్లెల్లో ఆరోగ్యం ఆమడ దూరమైంది. పల్లెనాడికి జ్వరం పట్టుకుంది. ఇప్పుడు వృద్ధులు, గర్భిణులు, చిన్నారులకు తిప్పలు మొదలయ్యాయి. మంచానికే పరిమితమైన వారిని పట్టించుకునే నాథుడే లేరు. ఈ తరుణంలో ప్రజారోగ్యం పరిస్థితి పల్లెల్లో కొడిగట్టిన దీపంలా మారింది.

ఫ్యామిలీ ఫిజిషియన్ ఆరంభం ఇలా...

పల్లెలోని పేదల ఆరోగ్యానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భరోసానిస్తూ ఫ్యామిలీ ఫిజిషియన్‌ను ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది. జిల్లాలో లక్షలాది మందికి ఉచిత వైద్యపరీక్షలు, చికిత్స అందిస్తూ వచ్చింది. మంచానికి పరిమితమైన వారి ఇంటి వద్దకే వైద్యులు వెళ్లి ఆరోగ్య బాగోగులను చూసుకునేలా చేసింది. ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్, చికిత్స తీసుకున్న వారికి కూడా ఆరోగ్య అభయమిచ్చేది. మందులు, మాత్రలు ఉచితంగా ఇస్తూ పేదలకు అండగా నిలిచింది. తద్వారా పేదలకు సైతం ఆరోగ్య ధీమానిచ్చేది.

జిల్లాలో ఇలా..

జిల్లాలోని 50పీహెచ్‌సీల పరిధిలో 464 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఉన్నాయి. ఇందుకోసం 44 ...104 వాహనాలను వినియోగిస్తున్నారు. ప్రతినెలా రెండు రోజులు గ్రామాల్లో ఈ విధానం అమలయ్యేలా షెడ్యూల్ ఉండేది. ఇందుకుగాను 102 వైద్యులను కేటాయించారు. 104 వాహనం వద్ద 67 రకాల మందులు, 14 పరీక్షలు చేసేవారు. అయితే కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో ఫ్యామిలీ ఫిజిషియన్ తలుపులు మూసుకుంటున్నాయి.

పట్టించుకుంటే ఒట్టు..

కూటమి ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు కావస్తోంది. ఈలోపే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసినా ఆరోగ్య కార్యక్రమాలను నీరుగారుస్తోంది. గర్భిణులు, బాలింతలకు రక్తహీన పరీక్షలు క్రమం తప్పకుండా జరిగేవి. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదని మహిళలు వాపోతున్నారు. మంచం బాట పట్టిన వారు లేవలేక ఇంటి పట్టునే మూలుగుతున్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్ చేసుకున్న వారు మళ్లీ ఆస్పత్రుల బాట పడుతున్నారు.

తలుపు తట్టేవారేరి?

పక్షవాతం, ప్రమాదాల్లో గాయపడి మంచానికే పరిమితమైన వారికి గతంలో 104 వాహనాల ద్వారా నెలకోసారి వెళ్లి మందులిచ్చేవారు. రక్తపరీక్షలు చేసేవారు. ఇప్పుడా వాహనాలు ఎప్పుడొస్తున్నాయో తెలియని పరిస్థితి. పల్లెలకు వాహనాలు రాక నెలరోజులైందని గ్రామీణులు వాపోతున్నారు. ముందు ఊరికి డాక్టర్ వస్తున్నారంటే ఆశావర్కర్లు, వలంటీర్లు వచ్చి తలుపులు తట్టి వైద్యం చేయించేవారు. ఇప్పుడు వైద్యపరీక్షలు, చికిత్స తీసుకోకపోవడంతో బీపీ, షుగర్ లెవల్ పడిపోతున్నాయని పల్లె జనం రోదిస్తున్నారు.

గతంలో ఈ పరీక్షలు చేసేవారు..
-గర్భ నిర్ధారణకు యూరిన్ టెస్ట్
-హిమోగ్లోబిన్ టెస్ట్
-ర్యాండమ్ గ్లూకోజ్ టెస్ట్
-మలేరియా టెస్ట్
-హెచ్ఐవీ నిర్ధారణ
-డెంగీ టెస్ట్
-మల్టీపారా యూరిన్ స్ట్రిప్స్ (డిప్ స్టిక్)
-అయోడిన్ టెస్ట్
-వాటర్ టెస్టింగ్
-హెపటైటిస్ -బి నిర్ధారణ
-ఫైలేరియాసిస్ టెస్ట్
-సిఫలిసిస్ ర్యాపిడ్ టెస్ట్
-విజువల్ ఇన్‌ఫెక్షన్
-స్పుటమ్ (ఏఎఫ్‌బీ)

కంటి వెలుగుపై కారు చీకట్లు

గత ప్రభుత్వ హయాంల జిల్లాలో కంటివెలుగు కార్యక్రమం కింద వేలాది మందికి పరీక్షలు చేసి అద్దాలు ఇచ్చారు. అలాంటి కార్యక్రమంపై నేడు కారుచీకట్లు కమ్ముకున్నాయి. ఫ్యామిలీ ఫిజిషియన్‌లో కంటి పరీక్షలు చేసిన వారికి హెల్త్ క్యాంపుల్లో కంటిఅద్దాలు ఇచ్చేవారు. వాటికి కూడా ఇప్పుడు చెక్ పడింది.

తారుమారు..

దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఇద్దరు వైద్యులు, 104 వాహనంలో ఒకరిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నియమించింది. ఆయా గ్రామాల పరిధిలో డాక్టరే వారి ఇళ్ల వద్దకు వెళ్లి వైద్యం చేసేలా చర్యలు తీసుకుంది. అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ విధానాన్ని నేడు పూర్తిగా ఎత్తేశారు. ఇప్పుడు డాక్టర్లు పల్లెలకు వచ్చే పరిస్థితి లేదు. నిత్యం పల్లెల్లో డాక్టర్లు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు తిరిగేవారు. ఇప్పుడు జ్వరాలు, చిన్నారులకు సీజనల్ ప్రభావం విజృంభిస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు.

చాలా కష్టంగా ఉంది ..



చిన్నచిన్న జబ్బులకు వృద్ధులకు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వెళ్లడానికి చాలా కష్టంగ్లే ఉంది. గత ప్రభుత్వంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారులు గ్రామాల్లో ఉచిత క్యాంపును ఏర్పాటుచేసి వైద్యాన్ని అందించేవారు. పడక స్థితిలో ఉన్న రోగులను ఇంటి వద్దకే వెళ్లి వారికీ చికిత్స అందించేవారు. ప్రస్తుతం వృద్ధులు చాలా ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్‌ను కొనసాగించాలి.

-జమున, పూతలపట్టు

పల్లెకొచ్చి చూసేవారు..



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు మా ఊర్లోకే 104 వాహనం వచ్చేది. డాక్టర్లు ఇక్కడే పరీక్షలు చేసి మందులు ఉచితంగా ఇచ్చేవారు. ఇప్పుడు ప్రభుత్వం మారింది. 104 వాహనం రావడం ఆగింది. చిన్న దగ్గు, జలుబు వచ్చినా ఇప్పుడు పట్టణానికి వెళ్తున్నాం.

-చిన్న పాపమ్మ, ఎస్ ఆర్ పురం

అనుమతిలేకుండా టపాసుల విక్రయం

- ఒకరిపై కేసు నమోదు

చిత్తూరు అర్బన్: నగరంలో అనుమతి లేకుండా టపాసులు విక్రయిస్తున్న వ్యక్తిపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎలాంటి లైసెన్సు లేకుండా బజారువీధిలోని ఓ దుకాణంలో టపాకాయలు విక్రయిస్తున్నట్లు గుర్తించామని టూటౌన్ సీఐ నెట్టికంఠయ్య తెలిపారు. ఇక్కడ రూ.14 వేలు విలువ చేసే బాణాసంచా స్వాధీనం చేసకుని, దుకాణం నిర్వాహకుడు రవిచంద్రశెట్టిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

శ్రీనివాసశర్మకు డాక్టరేట్



శ్రీనివాసశర్మకు డాక్టరేట్ ప్రదానం చేస్తున్న వర్సిటీ నిర్వాహకులు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి గ్రామానికి చెందిన బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ప్రముఖ పురోహితులు పాణ్యం శ్రీనివాస శర్మకు డాక్టరేట్ లభించినట్లు తెలిపారు. శనివారం బెంగళూరులోని శివాజీనగర్ ఏజే ఇంటర్నేషనల్ హాల్‌లో భారత్ వర్చువల్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. పురోహిత, సంస్కృతి, సంప్రదాయ పద్ధతులపై అందించిన విశేషసేవలకు గుర్తింపుగా తనకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. పాణ్యం శ్రీనివాస శర్మకు డాక్టరేట్ ప్రదానం చేయడం పట్ల పలువురు ఆయన్ను అభినందించారు.

టైలర్లు ఐకమత్యంగా ఉండాలి

నగరి: టైలర్స్ యూనియన్ ఐకమత్యంగా ఉండాలని టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ చాన్‌బాషా తెలిపారు. ఆదివారం నగరిలో టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఉమాపతి ఆధ్వర్యంలో కార్యనిర్వాహక సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చాన్‌బాషా మాట్లాడుతూ అప్పుడప్పుడు టైలర్ యూనియన్ సమావేశం ఏర్పాటు చేసుకుని సమస్యలను చర్చించుకోవాలన్నారు. నగరి యూనియన్ పేరు, అభివృద్ధి రాష్ట్రస్థాయికి చేరుకోవాలన్నారు.



గురువులతో పూర్వవిద్యార్థులు

అపూర్వ కలయిక

బంగారుపాళెం: మండలంలోని గుండ్లకట్టమంచి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థులు 'గెట్ టు గెదర్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో 1986–87 సంవత్సరం 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు 37 సంవత్సరాల తరువాత కలుసుకున్నారు. అప్పట్లో చదువు నేర్పిన గురువులను పూర్వవిద్యార్థులు సన్మానించారు. చిననాటి చదువుల జ్ఞాపకాలను గుర్తుకు తెచుకుని సంతోషాన్ని వ్యక్తం చేశారు. తాము చదువుకున్న పాఠశాలకు అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్



పేకాట రాయుళ్ల అరెస్టు చూపుతున్న సీఐ హనుమంతప్ప

కార్వేటినగరం: తమిళనాడు సరిహద్దు ప్రాంతంలో పేకాటాడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేసినట్లు సీఐ హనుమంతప్ప తెలిపారు. ఎస్ఐ కార్యాలయ ఆవరణలో ఆదివారం పేకాట రాయుళ్లను అరెస్టు చూపించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ తమిళనాడుకు సరిహద్దుల్లో కొల్లాగుంట బ్రిడ్జి సమీపంలోని మామిడి తోపులో పేకాటాడుతున్నట్లు అందిన రహస్య సమాచారం మేరకు ఎస్ఐ రాజ్‌కుమార్ తమ సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేసి వారి వద్ద ఉన్న రూ.37,830 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా పేకాట, గంజాయి, బెల్టు షాపులు, సారా తయారీ, అమ్మకాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ మునికృష్ణ, ఇంటలిజెన్స్ సిబ్బంది తారక్ పాల్గొన్నారు.

ప్రైవేట్ యాజమాన్యాల తీరు మార్చుకోవాలి

చిత్తూరు కలెక్టరేట్: ప్రైవేట్ యాజమాన్యాలు తమ తీరును మార్చుకోవాలని ఏబీవీపీ విద్యార్థి సంఘం చిత్తూరు బాగ్ కన్వీనర్ పవన్ యాదవ్ అన్నారు. ఈ మేరకు ఆ సంఘ నాయకులు నగరంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఇంటర్ తరగతులను అడ్డుకున్నారు. ఆయన మాట్లాడుతూ కొంగారెడ్డిపల్లిలోని ఓ ప్రైవేట్ కళాశాల ఆదివారం ప్రత్యేక తరగతుల పేరుతో విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఆరోపించారు. విద్యార్థుల నుంచి సమాచారం అందగానే వెళ్లి అడ్డుకుని విద్యార్థులను ఇళ్లకు పంపివేసినట్లు తెలిపారు. సెలవు రోజుల్లో తరగతులు నిర్వహించి విద్యార్థులను ఒత్తిడి చేయడం సరైన పద్ధతి కాదని హెచ్చరించారు. పర్యవేక్షించాల్సిన ఇంటర్మీడియట్ డీవీఈఓ ఏమీ తెలియనట్టుగా మిన్నకుండడం సరికాదన్నారు. సంఘ నాయకులు ప్రవంత్, రుషేంద్ర పాల్గొన్నారు.

31న ఉచిత వైద్యశిబిరం

కాణిపాకం: ఈనెల 31న బెంగళూరు వైదేహి హాస్పిటల్ వైద్యులు కాణిపాకంలోని దేవస్థాన ఆస్థాన మండపంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఈఓ వాణి తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత హెల్త్ క్యాంపు ఏర్పాటు చేశారన్నారు. భక్తులు, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు ఈ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

లక్షాధికారులను చేయడమే లక్ష్యం



మహిళా సభ్యులకు చెక్కును అందజేస్తున్న అధికారులు

గుడిపాల: మహిళా సంఘాలను లక్షాధికారులను చేయడమే ప్రధానమంత్రి నరేంద్రమోదీ లక్ష్యమన్నారు. ఆదివారం మోదీ గుడిపాల ఎంపీడీఓ కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల సభ్యులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ప్రధాని మాట్లాడుతూ స్వయం సహాయక సభ్యులు ఆర్థికంగా బలోపేతం కావడానికి లక్‌పత్ దీది పథకం ప్రధాన ఉద్దేశం అన్నారు. దీనివల్ల పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని వారికున్న అవసరాలను సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. ఇందులోభాగంగా మండలంలోని 33 వీఓల ద్వారా 165 మందిని ఎంపిక చేసుకొని వారిని అభివృద్ధి చేయడం జరుగుతుందని ఇందిరా క్రాంతి ఏపీఎం సుధారాణి తెలిపారు. ఇందులో భాగంగా బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి, ఉన్నతి రుణాల కింద రూ.3కోట్ల 29లక్షలు మహిళా సంఘాలకు అందజేశారు. ఎంపీటీసీలు గోళ్ల హరిప్రసాద్, విజయలక్ష్మి, వెలుగు సీసీలు లోకనాథరెడ్డి, హేమచంద్రారెడ్డి, మల్లీశ్వరి పాల్గొన్నారు.

ముందస్తు చికిత్సతో కంటి చూపు పదిలం



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనాథ్

పుత్తూరు: ముందస్తు చికిత్సల ద్వారా కంటి చూపును కాపాడుకోవచ్చునని ఎస్వీ అరవింద్ కంటి ఆసుపత్రి డాక్టర్ కె.శ్రీనాథ్ తెలిపారు. ఆదివారం స్థానిక వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కంటి చూపు–జాగ్రత్తలు అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ శ్రీనాథ్ మాట్లాడుతూ వంశపారంపర్యంగా కంటి చూపు తగ్గే అవకాశం ఉంటుందన్నారు. 40 ఏళ్లు దాటిన వారిలో క్యాటరాక్ట్ సమస్య సాధారణంగా మొదలవుతుందన్నారు. దీంతో కంటిలో ఒత్తిడి ఎక్కువ కావడంతో మెదడుకు వెళ్లే నరం దెబ్బతింటుందన్నారు. ముందస్తుగా క్యాటరాక్ట్‌కు చికిత్స తీసుకోంటే కంటి చూపు దెబ్బతినదని తెలిపారు. చిన్న పిల్లలు చదవడానికి, రాయడానికి ఇబ్బందిపడుతుంటే నిర్లక్ష్యం వహించకుండా వెంటనే కంటి పరీక్షలు చేయించడం శ్రేయస్కరమన్నారు.

కరుణించని వరుణుడు



టి.పుత్తూరులో ఎండుతున్న వేరుశనగ పంట



దిగువమోదలపల్లె వద్ద ఎండుతున్న వేరుశనగ పంట

- ఖరీఫ్‌లో ఎండుతున్న పంటలు
- ఆందోళనలో రైతన్నలు

తవణంపల్లె: వరుణదేవుడు కరుణించకపోవడంతో చినుకులు నేలరాలక సాగు చేసిన పంటలు ఎండుముఖం పడుతున్నాయి. దీంతో పంటలు సాగు చేసిన రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలు ప్రకృతి వైపరీత్యం వల్ల అప్పులు చేసి కష్టపడి సాగు చేసిన పంటలు చేతికి వస్తాయో లేదో అని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ఖరీఫ్‌లో వర్షాధారం కింద ప్రధానంగా వేరుశనగ, కంది, అలసంద, అనప, జొన్న పంటలను సాగు చేశారు. కానీ సకాలంలో వర్షాలు పడకపోవడంతో మూడు విడతలుగా వేరుశనగ విత్తనాలు విత్తినారు. ఎండలు వేసవిని తలపిస్తున్నాయి. ఆగస్టు మాసంలో మొదటి వారంలో వర్షాలు పడ్డాయి. 20 రోజులుగా వరుణదేవుడు కరుణించక చినుకులు పడకపోవడంతో సాగు చేసిన పంటలు ఎండుముఖం పడుతున్నాయి. ఖరీఫ్‌లో పంటలు సాగు చేస్తే మంచి దిగుబడి వస్తుందని ఆశించిన రైతులకు వరుణదేవుడు మొండి చెయ్యి చూపుతున్నాడు. మండలంలో 3,300 ఎకరాల్లో పంటలు సాగులో ఉండగా వేరుశనగ వెయ్యి ఎకరాల్లో సాగులో ఉంది. వేరుశనగ పంటలో మిశ్రమ పంటగా కంది, జొన్న, అనప, అలసంద పంటలు సాగులో ఉన్నాయి.

ఎండను తట్టుకోవడానికి యూరియా స్ప్రే చేయాలి:

ఖరీఫ్ సాగు చేసి వర్షాభావంతో ఎండుతున్న పంటలకు రైతులు యూరియా ఎరువును 50 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేస్తే ఎండ తీవ్రతకు పంట తట్టుకుంటుందని మండల వ్యవసాయాధికారి జి. ప్రవీణ్ తెలిపారు. ఆగస్టు మొదటి వారంలో వర్షాలు పడ్డాయి. తర్వాత వర్షాలుపడనందున అక్కడక్కడ వేరుశనగ పంట వాడుముఖం పడుతోందని వివరించారు.

-వ్యవసాయాధికారి ప్రవీణ్

శరవేగంగా బ్రహ్మోత్సవ ఏర్పాట్లు



రంగులు వేస్తున్న సిబ్బంది



లైట్లు వేస్తున్న సిబ్బంది

కాణిపాకం: స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి వారి ఆలయంలో బ్రహ్మోత్సవ ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. స్వామివారి ఆలయ పరిసరాలను విద్యుత్ దీపాలంకరణలతో ముస్తాబు చేస్తున్నారు. స్వామివారి రాజగోపురానికి, సుపథ మండపంలో, ఆలయం పరిసరాలలో ఎల్ఈడీ లైట్ల కటౌట్లు, విద్యుత్ ఎల్ఈడీ లైట్లు వెలుస్తున్నాయి. రంగులు వేసే పనులు శరవేగంగా సాగుతున్నాయి.